# ఆర్కిటిక్ దేశాలు... సరిహద్దు వివాదాలు!!

**శీతకాలం చలి.. వేసవి కాలం ఎండ.. వర్షాకాలం వానలు- ఇది మనకు తెలిసిన రుతు గమనం! కాని, శీతకాలంలోనే కాకుండా.. ఎండకాలంలోనూ మంచు దుప్పటి కనిపిస్తే.. అదే ఆర్కిటిక్!! భూగోళానికి అంటార్కిటిక్ దక్షిణ ధ్రువమైతే... ఆర్కిటిక్ ఉత్తర ధ్రువం. కెనడా, గ్రీన్‌లాండ్ (డెన్మార్క్), రష్యా, అమెరికా (అలస్కా), ఐలాండ్, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్‌లలోని కొన్ని భాగాలను; ఆర్కిటిక్ సముద్రాన్ని కలిపి ఆర్కిటిక్ ఖండం అంటారు. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ-1982 ప్రకారం.. ఐదు ఆర్కిటిక్ దేశాలు- రష్యా, అమెరికా, కెనడా, డెన్మార్క్, నార్వే... తమ తమ తీర ప్రాంతం నుంచి 200 నాటికల్ మైళ్ల మేర ఎకనమిక్ జోన్‌ను నియంత్రిస్తాయి. ఈ ఐదు ఆర్కిటిక్ దేశాల మధ్య సరిహద్దులు వివాదాస్పదం. ఆర్కిటిక్ సముద్రం గడ్డకట్టి ఉండటంతో... ఈ వివాదాల పరిష్కారం దిశగా ఆయా దేశాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు భూతాపం (గ్లోబల్ వార్మింగ్) కారణంగా.. ఆర్కిటిక్ మంచు కరుగుతోంది. దాంతో అక్కడి చమురు, సహజ వాయువులపై ఆయా దేశాల దృష్టిపడి, ఆ ప్రాంతానికి ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది!!**

## ఆర్కిటిక్ ప్రాముఖ్యత:

ప్రపంచంలోని చమురు, సహజ వాయువు నిల్వల్లో 25 శాతం మేర ఆర్కిటిక్ ప్రాంతంలోనే ఉన్నట్లు అంచనా. మధ్యతూర్పు దేశాల్లో(ఇరాన్, ఇరాక్, సిరియా, పాలస్తీనా, అరేబియా దేశాలు)ని చమురు నిల్వలు ఖాళీ అయ్యాక.. ఆర్కిటిక్‌లోని ఇంధన వనరులు ఎనలేని ప్రాముఖ్యత సంతరించుకోవడం ఖాయం. ఆర్కిటిక్ ప్రాంతంలో ఇంధన వనరులతోపాటు యురేనియం, జింక్, కాపర్, సిల్వర్, డైమండ్స్ వంటి ఖనిజాలు(మినరల్స్) ఉన్నాయి. చేపలకు కూడా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది.

## వివాదాస్పద అంశాలు :

లొమొనొస్సవ్ రిడ్జ్... ఇది సముద్రగర్భ పర్వత శ్రేణి. నార్వే సమీపంలోని గ్రీన్‌లాండ్ నుంచి సైబీరియా తీరం వరకూ.. 1800 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇది ఆర్కిటిక్ దేశాల మధ్య వివాదాస్పద అంశం. వాణిజ్య నౌకాయానం-తూర్పు-పశ్చిమ మార్గం... పనామా కాలువ ద్వారా ఐరోపా నుంచి ఆసియాకు వాణిజ్య మార్గాన్ని 2,150 నాటికల్ మైళ్ల మేర తగ్గించే తూర్పు- పశ్చిమమార్గం కూడా వివాదాస్పదమే. తూర్పు-పశ్చిమ మార్గం తనదేనని కెనడా వాదిస్తోంది. ఈ వాదనను అంగీకరించే స్థితిలో ఇతర దేశాలు లేవు. ఆర్కిటిక్ దేశాల ప్రాదేశిక వివాదంలో ఒక కీలకాంశం ఉంది. అదేమంటే ఆర్కిటిక్ సముద్ర ప్రాంతంపై ఆధిపత్యం కోరుతున్న ఆర్కిటిక్ దేశాల ఖండచలనం... వివాదాస్పద ప్రాంతం వరకు విస్తరించి ఉందా? అని! మరోవైపు ఆర్కిటిక్ ఖండచలనం విస్తరణను అంచనావేయడం కూడా కష్టసాధ్యమన్నది నిపుణుల అభిప్రాయం.

SAKSHI

## రష్యా:

ఆర్కిటిక్ సముద్రతీరంలోని 1.2 మిలియన్ల చదరపు కిలోమీటర్ల ప్రాంతంపై రష్యా తన ఆధిపత్యాన్ని కోరుతోంది. అయితే, రష్యా వాదనకు సరైన శాస్త్రీయ ఆధారాలు లేవని ఐక్యరాజ్య సమితి కమిషన్ అభిప్రాయపడింది. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీ ప్రకారం- తీర దేశం 200 నాటికల్ మైళ్ల మేర సముద్ర ప్రాంతంపై సార్వభౌమాధికారం కల్గి ఉంటుంది. ఆ ప్రత్యేక ఆర్థిక మండలి ప్రాంతంలో సదరు దేశం చమురు, సహజ వాయువు తదితర నిక్షేపాల కోసం తవ్వకాలు జరుపుకోవచ్చు. అయితే, ఈ ప్రత్యేక ఆర్థిక మండలిని మరింత విస్తరించాలంటే మాత్రం సదరు దేశం సముద్రగర్భానికి ఖండచలనంతో లింక్ ఉందన్న విషయాన్ని రుజువు చేయాల్సి ఉంటుంది.

## రష్యా వైజ్ఞానిక యాత్రలు:

- రష్యాకు చెందిన ఉత్తర ఆర్కిటిక్ ప్రాంతానికి సముద్రగర్భ లొమొన్సవ్ రిడ్జ్ ద్వారా ఉత్తర ధ్రువంతో ప్రత్యక్ష సంబంధం ఉందన్న విషయాన్ని నిరూపించేందుకు... ఆ దేశం ఉత్తర ధ్రువానికి రెండు వైజ్ఞానిక యాత్రలు జరిపింది.
- రష్యా తీరానికి ఉత్తరాన ఉన్న ఆర్కిటిక్ సముద్రగర్భ ప్రాంతం... సైబీరియా ఖండచలనం అవిచ్ఛిన్నతేనని తన వైజ్ఞానిక యాత్రల్లో ఆ దేశం తేల్చింది. ఆర్కిటిక్ ఖండ చలనంపై తనకు న్యాయపరంగా హక్కులున్నాయనడానికి ఇదే ఆధారమని రష్యా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.
- 2007, ఆగస్టులో... ఉత్తర ధ్రువ ప్రాంతంలోని సముద్ర గర్భంలో... ఐదు కిలోమీటర్ల లోతులో టైటానియంతో చేసిన రష్యా జాతీయ జెండాను, ఆ దేశం ఏర్పాటు చేసింది. ఆదే సంవత్సరం... ఆర్కిటిక్ ప్రాంతంలో యుద్ధ విన్యాసాలు, క్రీడలు కూడా నిర్వహించింది.
- ఆర్కిటిక్ ప్రాంతంపై తనకు న్యాయపరంగా హక్కులున్నాయంటూ.. రష్యా చేస్తున్న వాదనను... ఇతర ఆర్కిటిక్ దేశాలైన అమెరికా, కెనడా, నార్వే, డెన్మార్క్ తోసిపుచ్చుతున్నాయి. ఈ దేశాలన్నీ ఆర్కిటిక్ సముద్ర ప్రాంతంపై తమకే హక్కులు న్నాయని వాదిస్తున్నాయి.

## కెనడా:

- ఆర్కిటిక్ భూములు, కాల్వలపై తనకు సార్వభౌమ హక్కులున్నాయని కెనడా గత 50 ఏళ్లుగా అంటోంది. ఆర్కిటిక్‌కు అధికారిక పర్యటన జరపడం ద్వారా... 2007, ఆగస్టులో కెనడా ప్రధాన మంత్రి స్టీఫెన్ హార్పర్ ఆ ప్రాంతంపై తమ దేశానికే హక్కు ఉందనే వాదనను మరోమారు తెరపైకి తెచ్చారు.
- మంచు గడ్డకట్టిన ప్రాంతంలో రవాణాకు వీలుగా 2007, జూలైలో ఎనిమిది పెట్రోల్ నౌకలను నిర్మించనున్నట్లు కెనడా ప్రభుత్వం ప్రకటించింది.
- ఉత్తర ధ్రువంపై తన సార్వభౌమాధికారానికి గుర్తుగా బాఫిన్ ఐలాండ్‌లో తొలి ఆర్కిటిక్ నౌకాశ్రయాన్ని నిర్మించనున్నట్లు కెనడా ప్రధాన మంత్రి వెల్లడించారు.

- బాఫిన్ ఐలాండ్‌కు సమీపంలో 2007, ఆగస్టులో కెనడా ప్రభుత సైనిక విన్యాసాలు నిర్వహించింది.
- ఆర్కిటిక్ ద్వీపసమూహంపై తనకే అధికారం ఉన్నందున... ఉత్తర ధ్రువం దిగువన అట్లాంటిక్ నుంచి పసిఫిక్‌కు పోయే ఉత్తర-పశ్చిమ కాలువ కూడా తనదేనని కెనడా వాదిస్తోంది.

## అమెరికా:

- ఆర్కిటిక్ సముద్రతీరంపై రష్యా సార్వభౌమాధికారాన్ని అమెరికా గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఆర్కిటిక్ సముద్రంపై అధికారాన్ని అంతర్జాతీయ సమాజానికి అప్పగించాలని ఆ దేశం కోరుతోంది. ఆర్కిటిక్ జలాలన్నీ అంతర్జాతీయ జలాలేనని అమెరికా వాదిస్తోంది. ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ ఆఫ్ ద లా ఆఫ్ ద సీస్-1982ను కూడా అమెరికా నేటికీ ఆమోదించకపోవడం గమనార్హం.

## డెన్మార్క్:

గ్రీన్‌లాండ్‌కు అనుబంధంగా ఉన్న డేనిష్ ప్రాంతం సమీపంలోని లొమొన్సవ్ రిడ్జ్‌పై తనకు సార్వభౌమాధికారం ఉందని చెప్పేందుకు వీలుగా ఆధారాలు సేకరించేందుకు.. డెన్మార్ 2007, ఆగస్టులో ఆర్కిటిక్‌కు వైజ్ఞానిక యాత్ర జరిపింది.

## పర్యావరణానికి ప్రమాదం:

ఆర్కిటిక్ ప్రాంతంలోని సహజ వనరుల కోసం ఆయా దేశాలు పోటాపోటీగా ఎగబడటం.. ఆ ప్రాంత పర్యావరణ హననానికి.. తద్వారా అమూల్యమైన జీవుల వినాశనానికి దారితీసే ప్రమాదముందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర-పశ్చిమ కాలువను తెరవడం..''ఎకలాజికల్ టైం బాంబ్'' విస్ఫోటనానికి పురికొల్పడమేనని అంటున్నారు. ఎందుకంటే.. అక్కడి మంచు నీటిపై పరుచుకునే ఆయిల్‌ను తొలగించేందుకు ఎలాంటి మార్గం లేదు!

- ఆర్కిటిక్ ప్రాంతాన్ని పర్యావరణ ముప్పు నుంచి కాపాడేందుకు అంటార్కిటికా ట్రీటీ సిస్టం మాదిరిగానే.. దేశాల మధ్య పూర్తి ఏకాభిప్రాయంతో అంతర్జాతీయ ఒప్పందం ఒకటి జరగాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.
- అంటార్కిటికా ట్రీటీ సిస్టం ప్రకారం-దక్షిణ ధ్రువంలోని అంటార్కిటికాపై తనకు సార్వభౌమాధికారాలు ఉన్నాయంటూ... ఏ దేశం కూడా వాదించకూడదు. అంతేకాకుండా అంటార్కిటికాలో ఎలాంటి సైనిక విన్యాసాలు నిర్వహించకూడదు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా శాస్త్ర పరిశోధనలకే పరిమితం చేయాలి.

## అర్కిటిక్ ప్రాంతం-భారత్:

- భారత్ 2007, ఆగస్టులో తొలిసారిగా ఆర్కిటిక్‌కు వైజ్ఞానిక యాత్ర జరిపింది. ఏటా వేసవిలో,

శీతాకాలంలో ఆర్కిటిక్ యాత్ర ఉంటుందని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కపిల్ సిబాల్ తెలిపారు. భారత్ ఇప్పటివరకూ అంటార్కిటికాకు 26 సార్లు వైజ్ఞానిక యాత్రలు జరిపింది.

- భూ వాతావరణాన్ని విశేషంగా ప్రభావితం చేసే ప్రాంతాల్లో ఆర్కిటిక్ అత్యంత కీలకమైంది. భారత దేశంలో రుతుపవనా లపై ఉత్తర ధ్రువం ప్రభావం విశేషంగా ఉందనే విషయం అధ్యయనాల్లోనూ తేలింది. ఈ నేపథ్యంలో... వాతావరణ మార్పులపై భారత వైజ్ఞానిక యాత్ర దృష్టిసారించింది.
- ఆర్కిటిక్ పరిశోధన కార్యక్రమంలో భాగంగా-బయోటెక్నాలజీ, జియాలజీ, గ్లాసియాలజీ, పాలియోక్లైమటాలజీలో.. ఆర్కిటిక్ మైక్రోబ్ (సూక్ష్మజీవులు)ల వినియోగంపై అధ్యయనాలు జరపనుంది.
- నార్వేకు చెందిన స్వాల్‌బార్డ్ ద్వీపసమూహం ప్రాంతంలోని న్వైఅల్సెండ్ వద్ద భారత శాస్త్రవేత్తల బృందం ప్రయోగాలు జరపనుంది. ఆర్కిటిక్ ప్రాంతంలో నార్వే, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, చైనాలకు ప్రత్యేక పరిశోధన కేంద్రాలున్నాయి.
- ఆర్కిటిక్ శాశ్వత పరిశోధన కేంద్రం ఏర్పాటు అంశం భారత ప్రభుత్వం పరిశీలనలో ఉందని మంత్రి కపిల్ సిబాల్ తెలిపారు.